కాపాడకపోతే..
కనుమరుగే..!

వ్యర్థాల డంపింగ్‌తో కుంచించుకుపోతున్న చిన్నపెద్దచెరువు



గోపన్‌పల్లి-గోపన్‌పల్లితండా మధ్యన ఉన్న చిన్నపెద్ద చెరువు వద్ద పోసిన మట్టికుప్పలు

- ఒకవైపు కబ్జా, మరోవైపు ఇష్టారాజ్యంగా చెత్త, మట్టి డంపింగ్
- అధికారులు చర్యలు తీసుకున్నా ఫలితం శూన్యం
- కొద్ది రోజుల తర్వాత లెవలింగ్ చేసి అక్రమ నిర్మాణాలు
- ఇదీ గోపన్‌పల్లి-గోపన్‌పల్లితండా చిన్నపెద్దచెరువు పరిస్థితి

రాయదుర్గం: అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎన్నో ఏళ్ళ చరిత్ర కలిగిన నీటి వనరులను కాపాడుకోలేని దుస్థితి నెలకొంటోంది. దశాబ్దాలుగా ఉన్న శిఖం స్థలం కాస్తా రోజుకింత చొప్పున కబ్జాలకు గురికావడం రోజూ చూస్తూనే తంతుగా మారిపోయింది. గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లితాండలోని చిన్నపెద్ద చెరువు పరిసరాలను చూస్తే ఇదే కనిపిస్తోంది. చెత్త, వ్యర్థాల డంపింగ్, కుప్పలు కుప్పలుగా మట్టిపోయడంతో రోజుకింత అని చెరువు కుంచించుకునిపోయి ఒకప్పుడు ఇక్కడ చెరువు ఉండేదేమోనని అనుకోవాల్సిన పరిస్థితి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే చెరువు పరిరక్షణకు జీహెచ్ఎంసీ, నీటిపారుదల శాఖ, రెవెన్యూ అధికారులు తగిన చర్యలు చేపడుతున్నా అక్రమార్కులు మాత్రం అధికారుల కళ్లు కప్పి యథేచ్ఛగా చెత్త, వివిధ వ్యర్థాల డంపింగ్‌ను చేస్తున్నారు. ఇది వరకు చెరువు చుట్టూరా ఫెన్సింగ్ వేసినా కొంతమంది ఆ ఫెన్సింగ్‌ను సైతం కొద్ది కొద్ది జరుపుతూ డంపింగ్‌లు చేస్తున్నారు. దీంతో చెరువు పరిస్థితి మరీ అధ్వానంగా మారింది.





గోపన్‌పల్లి-గోపన్‌పల్లితండా మధ్యన ఉన్న చిన్నపెద్దచెరువు వద్ద వ్యర్థాలు పారబోసి మంట పెట్టడంతో పొగ వ్యాపిస్తున్న దృశ్యం

ఇప్పటికైనా అధికారులు సమన్వయంతో వ్యవహరించి చెరువులు, కుంటలు కబ్జాలపాలు కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. చెరువు చుట్టూరా మట్టి, వ్యర్థాల డంపింగ్ వేయకుండా కాపాడాల్సిన బాధ్యత మరింత చేపడితేనే వీటికి రక్షణ ఏర్పడుతుందని అందరూ భావిస్తున్నారు.

వ్యర్థాలు, మట్టి కుప్పలతో చెరువు కుచించుకుపోయేలా..

◆ గోపన్‌పల్లితాండలో ఎన్నో ఏళ్ళ చరిత్రకు నిదర్శనంగా ఉన్న చిన్నపెద్దచెరువు పరిస్థితి అగమ్యగోచరంగా మారిపోతోంది. చెరువు శివారులో మట్టి కుప్పలు కూడా పెద్ద ఎత్తున పోయడం నిత్యం జరిగిపోతోంది. దీనికితోడు వ్యర్థాలు, చెత్తాచెదారం వంటివాటిని కూడా డంపింగ్ చేస్తున్నారు. అంతేకాకుండా వ్యర్థాలు తెచ్చి వాటిని దొంగ చాటున పారవేసి వాటిని ఎవరికీ తెలియకుండానే కాల్చివేసే ప్రక్రియను కూడా చేస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఇటీవలి కాలంలో మట్టికుప్పలను భారీగా డంపింగ్ చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు కాస్తా కుచించుకుపోయేలా చర్యలు సాగిపోతున్నాయని వీటిని ఎప్పటికప్పుడు ఆపేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేసినా వాటిని జరుపుతూపోతూ మట్టికుప్పలు వేసి ఆ తర్వాత కొద్ది రోజులకు వాటిని చదును చేసి ఇళ్ల నిర్మాణం చేసేలా వాతావరణాన్ని కొందరు సృష్టిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

సుందరీకరిస్తే స్థానికులకు ఎంతో ఉపయోగం..

◆ గోపన్‌పల్లితాండలోని చిన్నపెద్దచెరువును సుందరీకరిస్తే ఈ ప్రాంతంలో ఇటీవల వెలుస్తున్న గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్ల వాసులకే కాకుండా ముఖ్యంగా స్థానికులకు ఎంతో ఉపయుక్తంగా మారడం ఉంటుంది. చుట్టూరా వాకింగ్, సైకిల్‌ట్రాక్ నిర్మించి గ్రీనరీ ఏర్పాటు చేస్తే ఎంతో మేలు చేకూరుతుంది. చిన్నపిల్లలు ఆడుకునే జోన్ ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. చెరువులోకి వెళ్ళకుండా చుట్టూరా ఫెన్సింగ్ వేసి ఆవల ట్రాక్‌లు, గ్రీనరీ, లైటింగ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అంతేకాకుండా పెద్దలు సేద తీరేలా కూర్చోవడానికి బల్లలు నిర్మాణం కూడా చేయాలని కోరుతున్నారు. అయితే గతంలో ఫెన్సింగ్ వేసినా దాన్ని పలుమార్లు జరిపారనే ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. అలాంటివి ఇక ముందు జరగకుండా తగిన చర్యలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



చెరువును కాపాడాలి..



గోపన్‌పల్లి, గోపన్‌పల్లితాండ మధ్య ఉన్న చెరువును అధికారులు, ప్రజాప్రతినిధులు కాపాడాలి. మేమంతా చేపలు పెంచుతూ వస్తున్నాం. చెరువు చుట్టూరా మట్టికుప్పలు, వ్యర్థాలు డంపింగ్‌లు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలి. రెవెన్యూ, జీహెచ్ఎంసీ, నీటిపారుదల శాఖ, పోలీసులు సంయుక్తంగా చర్యలు తీసుకోవాలి. ఫెన్సింగ్ వేసిన చోట సీసీ కెమరాలు ఏర్పాటు చేస్తే వ్యర్థాలు, మట్టి డంపింగ్‌లకు అడ్డుకట్ట వేసినట్లు అవుతుంది. ఆ దిశగా చర్యలు చేపట్టి, చెరువును పదికాలాల పాటు కాపాడేలా చూడాల్సిన అవసరం ఉంది.

– శంకరి రాజు
ముదిరాజ్, ముదిరాజ్‌సంఘం అధ్యక్షుడు

చెరువే మా జీవనాధారం..



గోపన్‌పల్లి–గోపన్‌పల్లితాండ మధ్యన ఉన్న చెరువు మా జీవనాధారం. దీన్ని అందరూ కాపాడాలి. మట్టి, వ్యర్థాలు పారబోయకుండా, చెరువు కుచించుకుపోకుండా కఠిన చర్యలు చేపట్టాలి. అంతే కాకుండా చెరువు చుట్టూరా కట్టను అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్‌గా మార్చాలి. గ్రీనరీని ఏర్పాటు చేసి ఈ ప్రాంతవాసులకు సేద తీరే ప్రాంతంగా మార్చాలి. ఆ దిశగా అధికారులు తగిన నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలి.

– శ్రీనివాస్ గోపన్‌పల్లివాసి

ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్ల హుడా కాలనీలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మన నల్లగండ్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. డాక్టర్ మనీంద్ర, డాక్టర్ అభినందనలకు పరీక్షలు చేసి అవసమైన వారికి మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో 328 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షులు పి.జలేందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు విజయేందర్ రెడ్డి పాల్గొన్నారు.

క్రీడాకారులకు 'హోప్' ప్రోత్సాహం



క్రీడాకారులను సత్కరిస్తున్న కొండ విజయ్ కుమార్

హఫీజ్‌పేట్: గోవా రాష్ట్రంలో నిర్వహించిన గోవా ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ క్రీడల్లో ప్రతిభ చూపించి పథకాలను సాధించిన మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులకు హోప్ ఫౌండేషన్ ప్రోత్సాహం అందించారు. ఆదివారం చందానగర్ పీజేఆర్ స్టేడియంలో మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ చూపించిన వారికి చైర్మన్ కొండా విజయ్ కుమార్ నగదు ప్రోత్సాహం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజేఆర్ స్టేడియంలో క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ అందజేస్తూ దేశంలో నిర్వహించే జాతీయ పోటీల్లో పతకాలు సాధించేలా తయారు చేయడం పట్ల శిక్షకులను ప్రత్యేకంగా అభినందించారు. పతకాలు సాధించిన వారిలో పూజిత ఒక బంగారు, ఒక సిల్వర్, ప్రదీప్ ఒక బంగారు, ఒక వెండి, శివ రెండు వెండి పతకాలు సాధించారు. ఈ కార్యక్రమంలో వినయ్‌కుమార్ గౌడ్, రెడ్డి ప్రవీణ్ రెడ్డి, విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.

రెండు దశాబ్దాల తర్వాత అ'పూర్వ' కలయిక

నాగార్జున ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం



పూర్వ విద్యార్థుల సమావేశంలో విద్యార్థులు, పాఠశాల కరస్పాండెంట్ భరత్, టీచర్లు

రాయదుర్గం: పూర్వ విద్యార్థులు రాయదుర్గంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో సందడి చేశారు. 20 ఏళ్ళ తర్వాత అంతా మళ్ళీ ఒక్కచోట చేరారు. ఆదివారం ఉదయం పాఠశాలలో 2004 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా ఒక్కచోట చేరి పూర్వ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మొదట పాఠశాల ఆవరణకు చేరుకున్నవారంతా ఒకరినొకరు పలకరిస్తూ వారి క్షేమ సమాచారాలు తెలుసుకుంటూ ఆత్మీయంగా ఆలింగనం చేసుకుంటూ పాత మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. అంతేకాకుండా చదువుకునే సమయంలో తాము చేసిన అనంతరం అందరూ పాఠశాల ఆవరణంలో సమావేశమై భవిష్యత్తులో ఏమి చేయాలనే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ భరత్‌కుమార్‌తోపాటు తాము చదివే సమయంలో ప్రిన్సిపాల్‌గా పనిచేసిన సత్యవతి, మ్యాథ్స్ టీచర్ డేవిడ్, పీఈటీ నవీన్‌కుమార్, అప్పటి టీచర్ ప్రస్తుత ప్రభుత్వ హెచ్ఎం వెంకటేష్, టీచర్లు అశోక్, మురళిలతో కూడా మాట్లాడి వారిని ఘనంగా సత్కరించారు. మరోసారి ప్రత్యేకంగా సమావేశం కావాలని, మిగతావారంతా వచ్చేలా ప్రణాళిక రూపొందించాలని కూడా నిర్ణయించారు. అనంతరం అంతా కలిసి చిల్కూరుకు తరలివెళ్ళారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గచ్చిబౌలి: ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన ఆదివారం రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ నర్సింహగౌడ్ తెలిపిన ప్రకారం వివరాలి ఇలా ఉన్నాయి... రాయదుర్గం ఎస్‌బీఐ ముందు ఉన్న ఫుట్‌పాత్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి (30–35) చనిపోయి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. రాయదుర్గం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. అతిగా మద్యం సేవించి చనిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వివరాల కోసం 9985308913ను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

నిబంధనలు ఉల్లంఘించే కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్



కొండాపూర్ శ్రీచైతన్య కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

గచ్చిబౌలి: ఇంటర్‌బోర్డు నిబంధనలు బేఖాతరు చేసే కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మాదాపూర్, కొండాపూర్‌లోని శ్రీచైతన్య కళాశాలలోపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కొండాపూర్‌లోని శ్రీచైతన్య కళాశాల వద్ద తరగతులను బహిష్కరించి ధర్నా నిర్వహించారు. ప్లకార్డులు చేతుల్లో ధరించి నినాదాలు చేస్తూ తమ నిరసనను కొనసాగించారు. అనంతరం వారు మాట్లాడుతూ ధనార్జనే ధ్యేయంగా కేవలం కాసుల కక్కుర్తితో విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసం చేస్తూ ఇంటర్‌బోర్డు నిబంధనలు ఉల్లంఘించి అనధికారకంగా శ్రీచైతన్య జూనియర్ కళాశాలను నడిపించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ రెండో సంవత్సరం తరగతులను జూన్ రెండో వారం నుంచి ప్రారంభించాల్సి ఉండగా ఏప్రిల్ 20 నుంచే ప్రారంభించడం సిగ్గుచేటన్నారు. శ్రీచైతన్య కేవలం మార్కులు, ర్యాంకుల పేరిట విద్యార్థులను ఆట వస్తువులుగా మార్చి మానసిక పునరుత్తేజానికి అవకాశం ఇవ్వకుండా ప్రశాంతతను దూరం చేస్తున్నారన్నారు. వాస్తవానికి ఈ కళాశాలలో లక్షలాది రూపాయల ఫీజుల రూపంల వసూళ్ళు చేస్తున్నా విద్యార్థులకు మౌలిక సదుపాయాలను కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇంటర్ బోర్డు గుర్తింపు లేకుండా నడుస్తున్న జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు మాజిద్, అనీల్, విజయ్, కిరణ్ పాల్గొన్నారు.

12 విభాగాల్లో ప్రతిభావంతులకు అవార్డుల అందజేత



అవార్డులను అందజేస్తున్న దృశ్యం

మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ఆదివారం ప్రైడ్ ఆఫ్ ఇండియా తెలంగాణ అవార్డ్స్ 2024 ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అవార్డులను 12 విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులను అందజేశారు. జేజే బ్రదర్స్ అసాధారణ సంగీత ప్రతిభను ప్రదర్శించారు. కిడ్స్ జీనియస్ బహుళ వాయిద్యాల నైపుణ్యంతో ప్రేక్షకులను ఆకర్షించారు. ఇసుక కళాకారుడు కాంత్‌రిసా ఇసుక కళతో అద్భుతమైన విజువల్ స్టోరీలను రూపొందించి అలరించారు. ఆరోగ్య సంరక్షణ విభాగంలో అచీవర్ డాక్టర్ ఎస్.బీరప్ప, ప్రత్యేక జ్యూరి డాక్టర్ మౌనిక బొప్పన తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడిగాంధీ



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: రక్తదానం సామాజిక బాధ్యతగా గుర్తించి పలు అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లి డైమండ్ హైట్స్‌లో కల్వకొలను చిత్తరంజన్ దాస్‌ట్రస్ట్, సనాతన ధర్మవారధి కల్వకొలను రామచంద్రమూర్తి 60 జన్మదినోత్సవం సందర్భంగా లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సంస్థ సౌజన్యంతో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన వైద్య పరీక్షలను చేయించుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం సామాజిక బాధ్యతగా అందరూ గుర్తించాలన్నారు. రక్తదానం చేసితోటి వారి ప్రాణాలను కాపాడాలని ఆయన సూచించారు. అంతేకాకుండా దానాల్లోకెల్లా రక్తదానం ఎంతో గొప్పదని దీనిని ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడిన వారు దైవసమానులుగా గుర్తించబడతారన్నారు. అనంతరం వైద్యులు కాలనీవాసులకు రక్తపరీక్ష, కంటి పరీక్షలు, షుగర్ చెకప్, ఇతర వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కూడా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. బీఆర్ఎస్ నాయకుడు సత్యనారాయణ ప్రసాద్, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో అలరించిన సంగీత విభావరి



మాదాపూర్ శిల్పారామంలో నిర్వహించిన సంగీత విభావరిలో పాల్గొన్న చిన్నారి కళాకారులు

మాదాపూర్: కళాకారులు అన్నమాచార్య కీర్తనలు, రామదాసు కీర్తనలతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సప్తస్వర అకాడమీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ ఆధ్వర్యంలో సంగీత నృత్య విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. పాహి పాహి, రామ రామ, మారుతీ మారుతీ, గేమ్ గేమ్ గణపతి తదితర భజనలను, అన్నమాచార్య కీర్తనలు, రామదాసు కీర్తనలు ఆలపించి అలరించారు. కళాకారులు నిత్యకమలాశ్రీ నందు, ఆముక్త, శ్రీహిత, శ్రీనిక, యువన్, యాషిక, శ్రీవిద్య, కార్తీక్, పూజిత, వేదశ్రీ, గౌరీ తదితరులు పాల్గొని ఆలపించారు. వినాయకకౌతం, రామాయణశబ్దం, ఆధ్యాత్మ రామాయణ కీర్తన తదితర అంశాలను శ్రీనిధి , మహతి, మైథిల్యా ప్రదర్శించి అలరించారు.

విద్యార్థుల ఎదుగుదలలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

శేరిలింగంపల్లి హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు బాల్‌రెడ్డి, నాగేందర్‌యాదవ్‌లను సన్మానిస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: విద్యార్థుల ఎదుగుదలలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (2003–04) బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు పదేళ్ళ తరువాత కలిసి వేడుకగా కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు ఏఏ ఉద్యోగాలు చేస్తున్నారో... కుటుంబ విషయాలను ఒకరిని, ఒకరు అడిగి తెలుసుకొని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ఎంత స్థాయికి ఎదిగిన ఉపాధ్యాయులను, తాము చదువుకున్న పాఠశాలలను మరువొద్దని అన్నారు. తాను కూడా శేరిలింగంపల్లి హైస్కూల్‌లోనే చదివానని, స్కూల్ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు బాల్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సురేష్ రాథోడ్, జమ్మయ్య, సురేష్, నర్సింగ్, శ్రీదేవి, రాకేష్, జమీల్, వెంటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం



శేరిలింగంపల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా గోపన్‌పల్లి, ఎన్‌టీఆర్ నగర్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాను సోమవారం నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకటనారాయణ రెడ్డి తెలిపారు.

- ◆ 11 కేవీ గోపన్‌పల్లి ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు గోపన్‌పల్లి విలేజ్, గోపన్‌పల్లి తండా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.
- ◆ 11 కేవీ ఎన్‌టీఆర్ నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ఎన్‌టీఆర్‌నగర్, సోఫా కాలనీ, తాజ్‌నగర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

హఫీజ్‌పేటలో..

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- ◆ శ్రీరాంనగర్ (జనప్రియనగర్) ఫీడర్ పరిధిలో ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 02.00 గంటల వరకు ప్రజయ్‌సిటి, ఇండస్ట్రీయల్ ఏరియా, కుమ్మరిబస్తీ, శ్రీరాంనగర్, బానుటౌన్‌షిప్, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- ◆ మాధవనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సాయి బ్యాంక్ ఏరియా, మాధవనగర్ పార్ట్, మాతృశ్రీనగర్ సొసైటీ ఏరియాలలో విద్యుత్ ఉండదన్నారు.
- ◆ మాతృశ్రీనగర్ ఫీడర్ మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మాతృశ్రీనగర్, బోర్ పార్కు, టెంపుల్ పార్క్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శిల్పాపార్క్ ఫీడర్ పరిధిలోని శిల్పాపార్క్, మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు అలేఖ్య ఫీడర్ పరిధిలోని ఆదిత్య అపార్ట్‌మెంట్స్, ఇజ్జత్‌నగర్, అలేఖ్య హోమ్స్ పరిసరాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మియాపూర్‌లో..

మియాపూర్: సెవన్ హిల్స్, అల్లాపూర్ సొసైటీ, గౌతమీనగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ హరీశ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు హోలిస్టిక్ ఆసుపత్రి ఏరియా, సెవన్ హిల్స్, మధ్యాహ్నం 1:30 నుంచి 3 గంటల వరకు అల్లాపూర్ సొసైటీ, అదేవిధంగా 3:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శ్రీనివాస్ కాలనీ, గౌతమీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

మదీనాగూడ సబ్ స్టేషన్...

ఈ–సేవా ఫీడర్, నీలిమగ్రీన్, దీప్తీశ్రీనగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుతుందని ఏఈ రాజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు వడ్డెర బస్తీ, మియాపూర్ విలేజ్, ఎస్ఎంఆర్ మెట్రో పొలీస్ అపార్ట్‌మెంట్, మియాపూర్ బిఎస్ఎన్ఎల్ ఎక్స్చేంజ్, పొట్లపల్లి అపార్ట్‌మెంట్, 1:30 నుంచి 3 గంటల వరకు మియాపూర్ మజీద్ ఏరియా, ప్రగతి ఎన్క్లేవ్, బచ్‌పన్ స్కూల్, అదేవిధంగా 3:30 నుంచి 5 గంటల వరకు విశ్వేశ్వరయ్య కాలనీ, మియాపూర్ పోలీస్ స్టేషన్ ఏరియా, సాయినగర్ కాలనీ, మదీనాగూడ మెయిన్ రోడ్డు, క్రిష్ణదేవరాయ కాలనీ, కాంక్రీట్ అపార్ట్‌మెంట్, బావర్చి హోటల్ ఏరియా, క్రోమా బిల్డింగ్ ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

టీఎన్‌జీఓకాలనీలో సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందించిన కాలనీవాసులు



అరికెపూడి గాంధీకి పూల బొకేను ఇస్తున్న కాలనీవాసులు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ టీఎన్‌జీఓకాలనీలో సమస్యలు పరిష్కరించాలని, త్వరితగతిన అభివృద్ధి పనులు చేపట్టాలని కాలనీవాసులు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడిగాంధీకి వినతి పత్రాన్ని అందించారు. ఆదివారం ఆయన నివాసంలో కాలనీవాసులు కలిసి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కాలనీలో పలు సమస్యలు నెలకొన్నాయని, అసంపూర్తిగా మిగిలి పోయిన సీసీరోడ్లను వేయాలని, కరెంట్ అంతరాయంపై చర్యలు తీసుకోవాలని, వీధి దీపాలను ఏర్పాటు చేసేలా చూడాలని వారు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ టీఎన్‌జీఓ కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. కాలనీలో నెలకొన్న పలు సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు దశలవారీగా అన్ని అభివృద్ధి పనులు చేపట్టేలా చే స్తామన్నారు. తాగునీటిని కుళాయిల ద్వారా ఎక్కువ ప్రెజర్‌తో విడుదల చేసేలా చూస్తామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇక్కట్లు లేకుండా నీరు వదలడం జరుగుతుందన్నారు. అంసపూర్తిగా మిగిలిన సీసీరోడ్లను పూర్తి చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ సమస్యపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పరిష్కరించేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు సత్యనారాయణ, టీఎన్‌జీఓ కాలనీవాసులు సుధాకర్, సంజీవయ్య, సైదిరెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి



పరిసరాలను శుభ్రం చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం తెల్లాపూర్‌లోని మేళ్ల చెరువు వద్ద స్వచ్ఛ సర్వేక్షణ్ –2024లో భాగంగా చెరువు పరిసరాలలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు పరిసర ప్రాంతాల్లో అనేక మంది చెత్తను వేస్తున్నారని అది సరైనది కాదన్నారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొనడం హర్షదాయకమన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒకరు వారి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇంటి పరిసరాలలో నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ, ఏఈ సంజయ్ పాల్గొన్నారు.

గణేశ్ గడ్డ ఆలయానికి భక్తుల తాకిడి

పటాన్‌చెరు టౌన్: సంకటహర చతుర్థి సందర్భంగా పటాన్‌చెరు మండలం రుద్రారం గణేశ్ గడ్డ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు సంతోష్ జోషి, జగదీశ్వర్ స్వామి, చంద్రశేఖర్, అయ్యప్ప ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఈఓ మోహన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు మల్లికార్జున్, ఈశ్వర్ తెలిపారు.